రంగా వడి వడిగా ఇంట్లోకొచ్చాడు.

నరసింహం అతనిని చూస్తూనే కుర్చీలోనుంచి లేచి నిలబడ్డాడు.

"ఏమైంది?" అడిగాడు ఆత్రుతగా.

"హరికృష్ణ ఇల్లు కనుక్కున్నాను--" ఆనందంగా అన్నాడు రంగా.

నరసింహం మొఖంలో సంతోషం వెలిగిపోయింది "శభాష్ రంగా! నువ్ నిజంగా జీనియస్‌వి! ఎలా కనుక్కో గలిగావ్?"

"నా అసిస్టెంట్‌ని మన బిల్డింగ్ బయట నిలబెట్టాను కదా! మురళీ కార్లో వెళ్లేప్పుడు వెనుకే ఫాలో అయ్యాడు. మురళి ఎక్కడెక్కడో తిరిగి తిరిగి, వాళ్ల స్నేహితులను కలుసుకున్నాడు. చివరకు మళ్ళీ బయల్దేరి శారదమ్మ ఇంటికి చేరుకున్నాడు."

నరసింహం ఉలిక్కిపడ్డాడు.

"శారదమ్మ ఇంటికి వెళ్లాడా?"

"అవున్సార్!"

"ఆమె యిల్లు వాడికెలా తెలుసు?"

"అదే నాకూ అర్ధం కావటం లేదు..."

"ఒకవేళ ఎవరి దగ్గరో హరికృష్ణ అడ్రస్ సంపాదించాడంటావా?"

"కాదన్సార్! తిన్నగా సొంత ఇంటికెళ్ళినట్లు వెళ్ళాడు ఇంట్లోకి. అంటే తరచుగా ఆ ఇంటికి వెళుతుండి ఉండాలి!"

నరసింహం మెదడులో ఆలోచనలు వేగంగా కదలసాగినయ్.

'అంటే దీనర్ధం ఏమిటి? మురళికి శారదమ్మతో, హరికృష్ణతో అంతకు ముందునుంచే లావాదేవీలున్నాయా? మురళియే వాళ్లకి సహాయం చేస్తున్నాడా? లేకపోతే వాళ్ళింటికి ఎందుకు వెళ్తాడు?'

ఆలోచిస్తున్నకొద్దీ నరసింహానికి మురళిమీద అనుమానం అధికమైపోతోంది.

"ఆ తరువాతేం జరిగింది?" రంగాని అడిగాడతను.

"అక్కడినుంచి నా అసిస్టెంట్ నాకు ఫోన్ చేశాడు. వెంటనే నేను ఆ ఇంటికెళ్లాను. మురళి వున్నాడేమో చూద్దామని ఆ ఇంటికెళ్ళి తలుపు కొట్టాను. శారదమ్మ తలుపు తెరచింది. లోపల అంతా వెతికానుగానీ ఎవ్వరూ కనిపించలేదు."

"అంటే .... మురళీ ఏమైనట్టు?"

"బహుశా వెనుక వేపునుంచి పారిపోయి వుంటాడు"

"ఎందుకని?"

"నన్ను చూసి -- లేదా ఇంకెవరయినా అనుకుని"

హరికృష్ణ ఆడే నాటకంలో మురళికి కూడా పాత్ర వుందని తెలుస్తోంది. కానీ మురళి ఎందుకలా చేస్తాడు?

“నన్నడిగితే -- ఆ హరికృష్ణగాడికి మన మురళి మద్దతు ఉందని గ్యారంటీగా చెప్పగలను సార్! అందుకే వాడింటికి వెళుతూ కూడా ఆ యిల్లు తెలుసన్న విషయం మనకు చెప్పకుండా దాచాడు--”

నరసింహానికి అనుకోకుండానే ఎదురయిన ఈ కొత్త పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలీటం లేదు. అంతటి దయనీయమైన స్థితిలోనూ అతనికి హఠాత్తుగా కోపం ముంచుకొచ్చింది. ఆనాటి క్రౌర్యం, క్రూరత్వం కళ్ళల్లో తొంగి చూచినయ్.

ఒకవేళ రంగా చెప్పిన మాటలు నిజమే అయితే మురళీ అంతుకూడా తను తేల్చుకుంటాడు. తన కిప్పుడు తెలుస్తోంది. ‘శత్రుశేషం’ అనేది ఉంచకూడదన్న లోకోక్తి ఊరికే రాలేదు. ఆ రోజే మురళిని కూడా చంపి పారేసి వుంటే ఈ రోజున తనకీ సమస్య వచ్చేది కాదు.

కానీ శారదమ్మ -- నిజం చెప్పకుండా ఉండటం కోసం -- ఆమె భర్త హత్యానేరం ఆమెమీద వేసుకొని జైలు కెళ్లటం కోసం -- తను మురళిని ట్రంప్‌కార్డుగా వాడుకోక తప్పలేదు.

ఇప్పుడీ ట్రంప్‌కార్డు తనకు ‘షో డౌన్’ చేయడానికి ప్రయత్నిస్తే ఈ కార్డ్‌ని కూడా చింపి అవతల పారేస్తాడు.

బయట కారు హారన్ వినిపించింది. చటుక్కున లేచి బయటికొచ్చి నిలబడ్డాడు నరసింహం.

ఘూర్ఖా సెల్యూట్ కొట్టి కారుని లోపలకు రానిచ్చాడు.

మురళీ కారుదిగి లోపలికొచ్చి విచారంగా సోఫాలో కూలబడ్డాడు.

“సర్వనాశనం అయిపోయింది మావయ్యా! ఈ రంగా నా ప్లానంతా నాశనం చేసేశాడు” అన్నాడు కోపంగా రంగా వంక చూస్తూ.

“ఏం చేశాడు?” ఏమీ తెలీనట్టు అడిగాడు నరసింహం.

“నేను నానా కష్టాలూ పడి ఆ హరికృష్ణగాడి అడ్రస్ సంపాదించి వాడిల్లు తెలుసుకున్నాను. ఇంటికెళ్లేసరికి మా అమ్మ కూడా నేను హరికృష్ణనే అనుకుని పలుకరించింది. హరికృష్ణగాడి గుట్టంతా తెలుసుకుందామని అనుకునే లోపలే -- ఈ రంగా వచ్చి తలుపు కొట్టాడు. దాంతో నేను వెనుకనుంచీ పారిపోవాల్సి వచ్చింది--”

“అబద్ధం” అన్నాడు రంగా కోపంగా.

“కాదు నిజమే!” అన్నాడు మురళి మరింత కోపంగా.

“నీ అసిస్టెంట్ మోటారుసైకిల్ మీద నన్ను ఫాలో అయ్యాడు. ADZ 9643 చాలా ఆ ఋజువు?”

రంగా ఉలిక్కిపడ్డాడు. ఆ గదిలో చిక్కటి నిశ్శబ్దం చోటు చేసుకుంది.

మురళి చెప్పటం మొదలుపెట్టాడు “మనవాళ్ళు నన్ను ఫాలో అవుతున్నారని తెలుసు. నా రక్షణ కోసం వాళ్ళని వెనగ్గా పంపించావని అనుకున్నా మావయ్యా! కానీ వాళ్ళు లోపలికి వస్తారని అనుకోలేదు. మొత్తం ప్లానంతా పాడయింది.”

- పూర్తిగా కట్టిన పేకమేడ ఒక్కసారిగా కూలిపోతే పిల్లవాడి మొహం ఎలా ఉంటుదో అలా వుంది నరసింహం స్థితి.

మోటర్ సైకిల్ నెంబరుతో సహా చెప్పిన మురళిని ఇంకేమనాలో అర్థంకాలేదు.

“రంగా వెనుకనుంచి రాగానే - నేను అందుకే పారిపోవల్సి వచ్చింది మామయ్యా-”

“పారిపోవటం ఎందుకూ?”

“లేకపోతే ఇంకేం చేయను? రంగా నన్ను అక్కడ గుర్తు పట్టాడంటే అమ్మకు నేను మురళీనన్న విషయం తెలిసిపోదూ? తెలిస్తే హరికృష్ణ మళ్ళీ మనకు దొరకడు గదా!”

రంగా నవ్వాడు “హరికృష్ణ ఇప్పుడిక ఎక్కడికీ తప్పించుకోలేడు? వెతుక్కుంటూ మనింటికే వస్తాడు”

మురళికి అర్థం కాలేదు.

“మనింటికా?”

“అవును!”

“ఎందుకొస్తాడు?”

“ఎందుకంటే శారదమ్మను మావాళ్ళు తీసుకెళ్ళి ఒకచోట దాచేశారు కాబట్టి!” మురళి మొహంలో రంగులు ఎలా మారుతున్నాయో గమనిస్తూ అన్నాడు రంగా.

నరసింహం అంతా ప్రేక్షకుడిలా వింటున్నాడు.

“మంచి పని చేశావ్ మావయ్యా! నేను చేద్దామనుకున్న పని నువ్వే చేశావ్! ఇప్పుడు ఆ హరికృష్ణగాడు ఇక్కడికెలా రాడో చూద్దాం!” అన్నాడు మురళీకృష్ణ ఆనందంగా.

నరసింహానికేమీ తోచటందు. ఈ సమాధానాన్ని అతడు అంత నిజాయితీగా ఎక్స్‌పెక్ట్ చేయలేదు.

తను తప్పు చేశాడేమో! తనవన్నీ కేవలం ఊహాలేనేమో! మురళికీ హరికృష్ణకూ మధ్య ఏ విధమయిన సంబంధమూ లేదేమో అన్న అనుమానం వచ్చింది.

“అమ్మను ఎక్కడ దాచావ్ మావయ్యా!” అడిగాడు మురళికృష్ణ కాజువల్‌గా.

నరసింహం చప్పున తలెత్తి చూశాడు. మళ్ళీ ఒక పేకముక్క నిలబడినట్టయింది- మురళీ కావాలని అడుగుతున్నాడా - ఊరికే అడుగుతున్నాడా అన్నట్టు చూసి “తర్వాత చెప్తాను” అన్నాడు. మొఖానికి పట్టిన చెమటలు తుడుచుకుంటూ.

“అంటే నన్ను కూడా నమ్మటం లేదా?” పౌరుషంగా అడిగాడు మురళి.

“మురళీ! నన్నర్థం చేసుకో! ఇందులో నమ్మటం, నమ్మకపోవటం అన్న ప్రసక్తే లేదు. మనిద్దరి ధ్యేయమూ ఒక్కటే! ఆ హరికృష్ణగాడిని అంతం చేయటం! అంచేత వాడు మన వలలోకి వచ్చేవరకూ నువ్వు నన్నేమీ ప్రశ్నించకు” సర్ది చెప్తూ అన్నాడు నరసింహం.

“సరే - నీ యిష్టం- కానీ మా అమ్మను మనమే దాచినట్లు హరికృష్ణకు ఎలా తెలుస్తుంది?”

“రేపు ఉదయం అన్ని న్యూస్‌పేపర్లోనూ ప్రకటన వేయిస్తున్నానే! అది చూడగా

తప్పదు. మన బోనులోకి తిన్నగా నడచిరాకా తప్పదు-"

"కానీ ఓ విషయం గుర్తుంచుకో! వాడిని మాత్రం నేనే నా చేతులతో చంపుతాను. వాడు నా రాధకు చేసిన ద్రోహానికి నేనే స్వయంగా ప్రతీకారం తీర్చుకోవాలి!"

"తప్పకుండా" అన్నాడు నరసింహం సంతృప్తిగా. అతనికి మళ్ళీ మురళి మీద నమ్మకం కలుగుతోంది.

మురళి తన గదిలోకి నడిచాడు.

కొద్దిసేపు ఆలోచనలతో సతమతమయ్యాడు నరసింహం "ఒరే రంగా-"

"ఏం సార్-"

"మురళిని మనం అనుమానించటం తప్పేమో అనిపిస్తోందిరా"

"తప్పు కావచ్చు. కాకపోవచ్చు! ప్రస్తుతం మనం వున్న పరిస్థితిలో అందరినీ అనుమానించాల్సిందేనండీ!" ఖండితంగా చెప్పాడు రంగా.

నరసింహం ఇంకేమీ మాట్లాడలేకపోయాడు.

## 17

మర్నాడు మురళి నిద్ర లేస్తూ హాల్లోకి వచ్చి ఆత్రుతగా పేపర్‌కోసం చూశాడు.

నరసింహం తన దగ్గరున్న పేపర్లు రెండు మురళికిచ్చాడు చూడమన్నట్టు.

రెండింటిలో మొదటిపేజీలోనే పెద్దపెద్ద అక్షరాల్తో కనబడుతోందది.

"హరికృష్ణా!

నువ్వు కనిపించటంలేదని మీ అమ్మ దిగులుతో మంచం పట్టింది. డాక్టర్లు కేవలం 24 గంటల గడువు మాత్రమే ఇచ్చారు. కనుక నువ్వుఈలోగా తప్పక వచ్చి కనీసం ఆమె ఆఖరి చూపయినా అందుకోగలవని ఆశిస్తున్నాను.

- నీ శ్రేయోభిలాషులు"

"ఫెంటాస్టిక్ - ఈ దెబ్బతో వాడి ఆట కట్టు-" ఉత్సాహంగా అన్నాడు మురళి అది చదివి.

నరసింహం గర్వంగా నవ్వాడు. తన చరిత్ర మురళికి పూర్తిగా తెలీదు! హరికృష్ణలాంటి ఘటాలను చాలామందిని మూడు చెరువుల నీళ్ళు తాగించాడు.

ఆ క్షణం నుంచీ హరికృష్ణ కోసం ఎదురు చూడడం ప్రారంభమయింది. నరసింహం ఫోన్ దగ్గరే తచ్చాట్లాడసాగాడు. హరికృష్ణ వచ్చే ముందు తప్పక ఫోన్ చేస్తాడని అతడికి గట్టి నమ్మకంగా ఉంది.

టైమ్ గడిచిపోతోందిగానీ హరికృష్ణ జాడ కనిపించలేదు. నరసింహానికి మళ్ళీ అనుమానాలు ప్రారంభమయ్యాయ్.

హరికృష్ణ పేపర్ ప్రకటనలు చూసి ఉంటాడా? ఒకవేళ చూసి కూడా ఖాతరు చేయకపోతే అప్పుడు తనేమిటి చేయటం? శారదమ్మను చంపేయాలా?

ఊహూ! అంత తొందరపడకూడదు. అదీగాక శారదమ్మను చంపేస్తే హరికృష్ణ తనని చంపక మానడు. ఇన్ని నాటకాలు విజయవంతంగా ఆడినవాడికి తనను చంపటం కష్టమేమీ కాదు. బాడీగార్డులను - ఎంత కాలమని పెట్టుకోగలడు తను!

అర్ధరాత్రి అయిపోయింది. నరసింహానికి నిద్ర ముంచుకొస్తోంది. సోఫాలోనే కూర్చుని నిద్రపోయాడు.

* * * *

తిరిగి మెలకువ వచ్చేసరికి చాలా తెల్లవారిపోయింది. టైం చూసుకున్నాడు. ఏడవుతోంది. రోజూ ఈపాటికల్లా బెడ్ కాఫీ తాగి గార్డెన్‌లో వాకింగ్ కెళ్తాడు.

"అమ్మాయ్ రాధా!" పిలిచాడతను. మరో రెండుసార్లు పిలిచినా జవాబు లేకపోయేసరికి వంటింటివేపు నడిచాడు. నౌఖరు వీరయ్య ఒక్కడే కూర్చుని ఉన్నాడక్కడ.

"అమ్మగారివాళ ఇంకా నిద్ర లేవలేదండీ!" అన్నాడతను నరసింహాన్ని చూడగానే లేచి నిలబడి.

నరసింహానికి ఆశ్చర్యం కలిగింది. రాధ ఎప్పుడూ ఇంత ప్రొద్దెక్కే వరకూ నిద్రలేవకుండా ఉండదు. పడక గది దగ్గరకెళ్ళి చూచాడతను. తలుపులు బార్లా తెరచే ఉన్నాయ్. మురళి తలగడను కౌగిలించుకుని నిద్రపోతున్నాడు.

నరసింహానికి ఏమీ అర్థం కావటంలేదు. రాధ ఏమయినట్లు? పడగ్గదిలోనూ, వంటింట్లోనూ, బాత్‌రూమ్‌లోనూ కూడా లేదు. మరోసారి ఇల్లంతా, గార్డెన్ అంతా వెదికాక మురళి గదిలోకి చేరుకుని మురళిని నిద్రలేపాడతను.

"ఏమిటి మావయ్యా?" బద్ధకంగా అడిగాడు మురళి.

"రాధ కనిపించటంలేదురా!"

మురళి స్ప్రింగులా పరుపుమీద నుంచి పైకి ఎగిరి కూర్చున్నాడు మళ్ళీ "రాధ కనిపించటం లేదా?"

"అవును!"

సరిగ్గా అప్పుడే పేపర్ కుర్రాడు పేపర్ తెచ్చి నరసింహానికిచ్చాడు. పేపర్ మొదటి పేజి చూస్తూనే మరో షాక్ తగిలినట్లు నిశ్చేష్టుడయ్యాడతను.

ఎదురుగ్గా మొదటి పేజీలోనే ఉంది ఓ ప్రకటన!

"మురళీ!

కుటుంబ కలతలవల్ల నువ్వు ఇల్లు విడిచి పోయిన దగ్గర్నుంచీ నీ భార్య రాధ మనోవ్యథతో మంచం పట్టింది! అమ్మతో సహా ఇక్కడికే వచ్చి మీ వివాదాన్ని పరిష్కరించుకుని నీ సంసారాన్ని నిలబెట్టుకో! ఒక్కరోజు ఆలస్యం చేసినా కూడా నీ భార్య నీకు దక్కదని మనవి చేస్తున్నాం-"

- నీ బంధు మిత్రులు"